ప్రభుత్వ పాఠశాల తనిఖీ

విద్యార్థినులతో మాట్లాడుతున్న బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో

పొతంగల్, జనవరి 24 : మండలంలోని కల్లూర్ ప్రభుత్వ పాఠశాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శుక్రవారం తనిఖీ చేశారు. విద్యాబోధనపై ఆరా తీశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈవో శంకర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

ఖిలీల్‌వాడి, జనవరి 24 : రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని నాగారంలో ఉన్న ఆర్టీఏ కార్యాలయంలో అధికారులు రోడ్డు భద్రతపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం నాగారం నుంచి వర్ని చౌరస్తా వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి ఉమామహేశ్వర్‌రావు కోరారు. కార్యక్రమంలో ఐదో టౌన్ ఎస్సై గంగాధర్, ఎంవీఐ కిరణ్‌కుమార్, రాహుల్ కుమార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన ఆరుగురికి జైలు శిక్ష

వినాయక్‌నగర్, జనవరి 24 : నగరంలో ట్రాఫిక్ సీఐ ప్రసాద్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 12 మందిపై కేసులు నమోదు చేశారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా జయరాజ్‌కు మూడు రోజులు, యాదగిరి, నరేశ్, జితేందర్, సల్మాన్‌కు రెండు రోజుల చొప్పున, బాలరాజుకు ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్‌జాన్ తీర్పు వెల్లడించారు. మరో ఆరుగురికి రూ.9,500 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

కోటగిరిలో ఒకరికి రెండు రోజులు..

కోటగిరి, జనవరి 24 : కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన కోటగిరి బస్టాండ్ వద్ద డ్రంక్ అండ్ డ్రైవ్ చేపట్టగా.. రుద్రూర్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి పట్టుబడ్డాడు. సదరు వ్యక్తిని శుక్రవారం బోధన్ కోర్టులో హాజరుపర్చగా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు.

డీసీసీబీ అర్ధ వార్షిక మహాజన సభ

ఖిలీల్‌వాడి, జనవరి 24 : ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు 103వ అర్ధ వార్షిక మహాజన సభను జిల్లాకేంద్రంలోని మార్క్‌ఫెడ్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి హాజరై మాట్లాడారు. సొసైటీ చైర్మన్లు నిర్వర్తించాల్సిన విధులను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి, డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జాబితాలో పేర్లు రాకపోవడంతో నగరంలోని ఖానాపూర్ గ్రామసభలో దరఖాస్తు చేసుకుంటున్న ప్రజలు

జన్నేపల్లి గ్రామ సభలో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలోని పేర్లు చదివి వినిపిస్తున్న కార్యదర్శి

మోర్తాడ్‌లో ఇందిరమ్మ ఇండ్ల జాబితాలోని పేర్లు చదువుతుండగా స్టేజీ వద్దకు చేరుకున్న ప్రజలు

నాలుగోరోజూ.. అదే తీరు

- అర్హులను పక్కన పెట్టి, అనర్హులను జాబితాలో చేర్చారని ఆగ్రహం
- మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో మండిపడిన పలువురు
- ప్రజాపాలనలో చేసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయని ప్రశ్నించగా.. నీళ్లు నమిలిన అధికారులు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 24 : రైతుభరోసా, ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం నాలుగోరోజు శనివారం జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభలు గందరగోళంగా మారాయి. అధికారులు అర్హుల జాబితాను చదివి వినిపిస్తుండగా.. తమ పేర్లు ఎక్కడికి పోయాయని పలువురు ఆగ్రహం వ్యక్తంచేశారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించగా.. ఇంకా ఎన్ని సార్లు దరఖాస్తు చేసుకోవాలని అసహనం వ్యక్తం చేశారు.

నగర శివారులోని గూపన్‌పల్లి, మానిక్‌భండార్, మాధవనగర్, రూరల్ మండలంలోని ఖానాపూర్, కాలూర్, కేశాపూర్, పాల్దాలో నిర్వహించిన వార్డుసభలు రసాభాసగా ముగిశాయి. రేషన్‌కార్డులకు సంబంధించి ప్రకటిస్తున్న అర్హుల జాబితా ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారని ప్రజలు అధికారులను నిలదీశారు. ప్రజాపాలనలో భాగంగా చేసుకున్న దరఖాస్తులు ఏమయ్యాయని, మళ్లీ ఎందుకు చేసుకోమంటున్నారని అధికారులకు ప్రశ్నించగా.. దిక్కులు చూడటం అధికారుల వంతైంది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు అర్హులను పక్కన పెట్టి, అనర్హులను జాబితాలో చేర్చారని ఆయా గ్రామాల్లో పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

కోటగిరి మండలంలోని సుద్దులం తండా, సుద్దులం, దేవునిగుట్ట తండా గ్రామాల్లో సభలు నిర్వహించారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నా తమకు కార్డు రాలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు.

పొతంగల్ మండలంలోని హంగర్గఫారం, జల్లాపల్లి ఫారం, టాక్లిలో గ్రామసభలు నిర్వహించారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేలు అందించే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక విషయంలో హంగర్గాఫారంలో ఆందోళన చేపట్టారు. లబ్ధిదారుల జాబితాలో అర్హులమైనా తమ పేర్లు ఎందుకు లేవని నిలదీశారు. అర్హులందరికీ రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు.

డిచ్‌పల్లి మండలంలోని అమృతాపూర్, గొల్లపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. ఎలాంటి సాగు భూమి లేకుండా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేశామని తెలిపారు. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని మండల ప్రత్యేక అధికారి యోహాన్ స్పష్టం చేశారు.

సిరికొండ మండలంలోని తాళ్లరామడులో నిర్వహించిన గ్రామ సభ గందరగోళంగా మారింది. ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసాకు అర్హులం కాదా, మా పేర్లు జాబితాలో ఎందుకు లేవని అధికారులను నిలదీశారు. సర్వేలు సక్రమంగా చేయలేదని, అనర్హుల పేర్లను జాబితాలో చేర్చారని మండిపడ్డారు.

మోర్తాడ్ మండలంలోని మోర్తాడ్, గాండ్లపేట్ గ్రామాల్లో శుక్రవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. మోర్తాడ్‌లో అధికారులు అర్హుల జాబితా చదువుండగానే ప్రజలు స్టేజీ వద్దకు చేరుకుని తమ పేర్లు వస్తాయేమోనన్న ఆశతో నిలబడ్డారు. జాబితాలో పేర్లు లేనివారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించడంతో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయభరోసా, రైతుభరోసా కోసం ప్రజలు పెద్దసంఖ్యలో దరఖాస్తులు చేసుకున్నారు.

మోర్తాడ్‌లో నిర్వహించిన గ్రామసభలో టీజీఎండీసీ చైర్మన్ ఈరవత్రి అనిల్, తెలంగాణ కోఆపరేటివ్ సొసైటీ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చక్కదిద్దుతూ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని అన్నారు. ఈనెల 26న నాలుగు పథకాలకు శ్రీకారం చుడుతున్నట్లు చెప్పారు.

బోధన్ మండలంలోని ఊట్‌పల్లి, రాజీవ్‌నగర్ తండా, లంగ్డా పూర్ తదితర గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ప్రజలు అధికారులను నిలదీశారు. వివిధ పథకాలకు ఎంపిక చేసిన అర్హుల జాబితాలో తమ పేర్లు లేవంటూ నిరసన వ్యక్తం చేశారు.

రెంజల్ గ్రామ సభలో దరఖాస్తులు చేసుకునేందుకు క్యూకట్టిన మహిళలు

నవీపేట మండలంలోని జన్నేపల్లి, స్టేషన్ ఏరియాలో గ్రామసభలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో తమ పేర్లు లేవంటూ జన్నేపల్లిలో నిర్వహించిన గ్రామసభలో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. గుడిసె లేదా పెంకుటిల్లు ఉండి సొంత ప్లాట్లు ఉన్న వారినే ఇందిరమ్మ ఇండ్లుకు ప్రభుత్వం అర్హులుగా గుర్తించిందని తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్ అన్నారు. అసలే ఇల్లు లేకుండా స్లాబ్ ఇంట్లో కిరాయి ఉన్న వారి జాబితాను ప్రభుత్వానికి నివేదించేందుకు మళ్లీ దరఖాసులను తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

రెంజల్ మండలంలో గ్రామసభలు నిరసనల మధ్య ముగిశాయి. వివిధ పథకాల కోసం గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్‌జాదవ్ తెలిపారు. మండలంలోని సాటాపూర్, తాడ్‌బిలోలి, రెంజల్, వీరన్నగుట్ట, వీరన్నగుట్ట తండాలో గ్రామసభలు నిర్వహించారు. రెంజల్, వీరన్నగుట్ట తండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ అత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల జాబితాను అధికారులు చదవకుండా ప్రజలు అడ్డుకున్నారు. అర్హులందరికీ పథకాలు వర్తించే వరకూ గ్రామసభలు జరగనివ్వబోమంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిరసన చేస్తున్న వారికి పోలీసులు నచ్చజెప్పారు. మళ్లీ దరఖాస్తు అందజేయాలని అధికారులు చెప్పడంతో శాంతించారు. ఆర్మూర్ పట్టణంలోని 36వ వార్డులో వార్డు సభను అధికారులు నిర్వహించారు. వివిధ పథకాలకు ఎంపికైన వారి పేర్లను చదివి వినిపించారు.

పోస్టర్ల ఆవిష్కరణ

బోధన్, జనవరి 24: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించనున్న సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల పోస్టర్లను శుక్రవారం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు యేశాల గంగాధర్ బోధన్ మండలం ఊట్‌పల్లి గ్రామంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మహాసభల సందర్భంగా మధ్యాహ్నం 2 గంటలకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఊరేగింపునకు రైతులు, రైతు కూలీలు, కార్మికులు, ఉద్యోగులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శి దండు సాయిలు, ఆ పార్టీ గ్రామ నాయకులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. ఒకరి మృతి

వేల్పూర్, జనవరి 24: మండలంలోని అమీనాపూర్ సమీపంలో మూల మలుపు వద్ద శుక్రవారం రాత్రి కారు అదుపు తప్పి బోల్తా పడగా జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ రెడ్డి(40) మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. శ్రీనివాస్‌రెడ్డి వేల్పూర్‌కు చెందిన వ్యక్తికారులో వేల్పూర్ వైపు వెళ్తుండగా మూల మలుపు వద్ద కారు అదుపుతప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్సుకు సమాచారం అందించారు. 108 అంబులెన్సులో ఆర్మూర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

పాఠశాలకు ఆర్వో ప్లాంట్ అందజేత

రుద్రూర్, జనవరి 24 : వర్ని మండలకేంద్రంలోని ఎస్ఎన్ పురం ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను మండల నాయకుల ఫోరం మాజీ అధ్యక్షుడు యలమంచలి శ్రీనివాస్‌రావు శుక్రవారం ప్రారంభించారు. మల్లంపటి సుజాత మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్లను అందజేసినట్లు తెలిపారు. పాత వర్ని ప్రభుత్వ పాఠశాలతోపాటు ఎస్ఎన్‌పురం పాఠశాలకు ఆర్వో ప్లాంట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజర్ శివశంకర్, శ్రీధర్, కిశోర్, అజయ్, మోయినుద్దీన్, సంజీవ్, ప్రకాశ్, రాంబాబు, రమేశ్, గంగప్ప, శ్యామ్, నారాగౌడ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి, జనవరి 24 : మండలంలోని ఎత్తొండ క్యాంప్‌లో గురువారం అర్ధరాత్రి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కోటగిరి ఎస్సై సందీప్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు.

పర్యావరణ సంరక్షణపై అవగాహన

చందూర్, జనవరి 24 : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ ఎర్త్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పర్యావరణ సంరక్షణపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులతో స్కూల్ ఎర్త్ కమిటీ ఏర్పాటు చేసి సభ్యులుగా ఇద్దరి చొప్పున ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చందూర్, జనవరి 24 : చందూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలలో చేరేందుకు 2025-2026 సంవత్సరానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ నరేశ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 8 తరగతి వరకు, ఇంటర్మీడియెట్‌లో సీఈసీ, బైపీసీలో 40 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయని, ఫిబ్రవరి 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని లేదా 7995057913 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

'స్పోర్ట్స్ డైరెక్టర్, పీఈటీపై చర్యలు తీసుకోవాలి'

డిచ్‌పల్లి, జనవరి 24 : క్రీడాకారుల డబ్బులు కాజేస్తూ అవినీతికి పాల్పడుతున్న టీయూ స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్, పీఈటీ నేతను విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధానకార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు టీయూ వీసీ యాదగిరిరావుకు శుక్రవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. డిసెంబర్‌లో ఖోఖో పోటీలు తమిళనాడులో జరిగాయని, యూనివర్సిటీ నుంచి 12 మంది క్రీడాకారులు వెళ్లగా.. వారి ట్రావెలింగ్, భోజనం ఇతర ఖర్చులకు యూనివర్సిటీ స్పోర్ట్స్ అధికారులు రూ.76,800 అందించారని తెలిపారు. ఇందులో సుమారు రూ. 40 వేలు మాత్రమే ఖర్చు చేశారని, మిగతా డబ్బులు ఎక్కడికి వెళ్లాయని ప్రశించారు. క్రీడాకారుల సెలక్షన్ సమయంలో కూడా టీముల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, క్రీడల నిర్వహణకు మాత్రం తక్కువ ఖర్చు చేస్తున్నారని ఆరోపించారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు ప్రిన్స్, దేవి, బిందు, హుస్సేన్, ప్రదీప్ ఉన్నారు.

విద్యార్థులకు యూనిఫామ్‌ల వితరణ

సారంగాపూర్, జనవరి 24 : మండలంలోని గుండారం ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులకు బొడ్డు ధరణి- కుందారపు అంజన్‌ప్రసాద్ దంపతులు తెలుపు రంగు యూనిఫామ్‌లు శుక్రవారం వితరణ చేశారు. గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో పేద విద్యార్థులకు వారి కుమారుడు తన్వీశ్ చేతుల మీదుగా వీటిని పంపిణీ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం అమర్‌నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

డిచ్‌పల్లి, జనవరి 24 : మండలంలోని ఘన్‌పూర్‌లో ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ షాదుల్లా, ఎంపీటీసీ రామకృష్ణ, సవిత, సొసైటీ డైరెక్టర్ సతీశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

101 అడుగుల ఎత్తైన జాతీయ పతాకం ఏర్పాటు

- రిపబ్లిక్ డే రోజు ఆవిష్కరణకు ఏర్పాట్లు

బోధన్, జనవరి 24: బోధన్ పట్టణం నడిబొడ్డున అంబేద్కర్ చౌరస్తాలో 101 అడుగుల ఎత్తైన జాతీయ జెండాను ఏర్పాటుచేశారు. బోధన్ పట్టణం కేంద్రంగా పనిచేస్తున్న ఏకచక్ర సేవా సమితి ఈ జాతీయజెండా ఏర్పాటుచేసింది. జాతీయ జెండా స్తంభాన్ని ఇప్పటికే అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేశారు. జాతీయ జెండా ఆవిష్కరణకు సంబంధించి ట్రయల్‌రన్‌ను కూడా చేశారు. ఈ జెండా ఆవిష్కరణ ఈనెల 26న రిపబ్లిక్ డే రోజు నిర్వహించనున్నట్లు ఏకచక్ర సేవా సమితి అధ్యక్షుడు అంకు మహేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఎంపీ ధర్మపురి అర్వింద్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, ఇన్‌చార్జి సీపీ సింధూ శర్మ, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మావతి శరత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అంకు సంధ్యా దాము పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

బడి బయటి పిల్లల గుర్తింపు

బాల్కొండ, జనవరి 24 : బడి బయట ఉన్న పిల్లల గుర్తింపు సర్వేను శుక్రవారం చిట్టాపూర్‌లో నిర్వహించారు. గ్రామ శివారులోని కోళ్ల ఫారంలో మహారాష్ట్ర నుంచి వలస వచ్చిన కార్మికుడు మారుతి వాగ్మారే కూతురు రాణి వాగ్మారేను గుర్తించారు. విద్యాహక్కు చట్టం 2009 ప్రకారం బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వారి తల్లిదండ్రులకు వివరించారు. పిల్లలను పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నామని హెచ్ఎం రామస్వామి తెలిపారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు బోధన్ మున్సిపల్ పాలకవర్గానికి వీడ్కోలు సభ

బోధన్, జనవరి 24: బోధన్ మున్సిపల్ కౌన్సిల్ పాలకవర్గం గడువు ఈనెల 26న ముగియనున్న నేపథ్యంలో శనివారం వీడ్కోలు సభ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ సభలో ముఖ్యఅతిథిగా బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పాల్గొంటారు. పాలకవర్గ సభ్యులను సన్మానించనున్నారు.

పైలేరియా బాధితులు జాగ్రత్తలు తీసుకోవాలి

పైలేరియా బాధితులతో మాట్లాడుతున్న వైద్యుడు ప్రవీణ్

నందిపేట్, జనవరి 24: పైలేరియా బాధితులు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వైద్యాధికారి ప్రవీణ్ సూచించారు. మండల కేంద్రంలోతో పాటు మండలంలోని గ్రామాల్లోని పైలేరియా (బోధకాలు) బాధితులతో శుక్రవారం మండల కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వారి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. వారి కాళ్లు వాపు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వారికి చికిత్స అందించారు. కార్యక్రమంలో వైద్యులు స్వాతి, సిబ్బంది పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ భాస్కర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో సీసీ కెమెరాలు ఎంతో అవసరం

మహేందర్‌ను సన్మానిస్తున్న ఎస్సై, గ్రామస్తులు

మోర్తాడ్, జనవరి 24: గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఈ రోజుల్లో ఎంతో అవసరమని కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చౌట్‌పల్లి గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఎస్సై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. గ్రామంలో రూ.95వేల ఖర్చుతో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామానికి చెందిన మహేందర్ ముందుకు రావడం అభినందనీయమన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు సహకరించాలని కోరారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటు చేయించిన మహేందర్‌ను ఎస్సైతోపాటు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రమేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు లైట్ల వితరణ

లైట్లను అందజేస్తున్న సరోజినమ్మ

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 24: ఎల్లారెడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు బోధన్ పట్టణానికి చెందిన సరోజినమ్మ ట్రస్ట్ నిర్వాహకురాలు, విశ్రాంత ఉపాధ్యాయురాలు సరోజినమ్మ శుక్రవారం నాలుగు వీధి దీపాలను అందజేశారు. విద్యార్థుల వార్షిక పరీక్షల ప్రిపరేషన్ కోసం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసేందుకు వాటిని అందజేసినట్లు ఆమె తెలిపారు.

టెన్త్ టాపర్లకు అభినందన

టాపర్లను సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

రెంజల్, జనవరి 24: పదిలో మండల టాపర్లుగా విద్యార్థినులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మాజీ ఎంపీపీ మోబిన్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కందకుర్తి ఉర్దూ మీడియం జడ్పీ ఉన్నత పాఠశాలలో 2023-24 టెన్త్ ఫలితాల్లో మండల్ టాపర్లుగా నిలిచిన నలుగురు విద్యార్థినులను పాఠశాల తరపున సన్మానించారు. విద్యార్థినులకు జ్ఞాపికలు బహూకరించారు. మాజీ సర్పంచ్ ఖలీంబేగ్, అసద్ బేగ్, హెచ్ఎంలు అబ్దుల్‌కరీం, సయ్యద్ అత్తర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే వేముల పరామర్శ

బొప్పారం గంగాధర్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

మెర్తాడ్, జనవరి 24: మండలంలోని పాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బొప్పారం గంగాధర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. గంగాధర్ కూతురు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

శక్కర్‌నగర్/ఆర్మూర్‌టౌన్, జనవరి 24: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి కోర్టు జైలు శిక్ష విధించింది. బోధన్ పట్టణంలో మద్యం తాగి వాహనం నడిపిన ఒక వ్యక్తిపై ఇటీవల కేసు నమోదుచేశారు. సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎదుట శుక్రవారం హాజరుపరిచినట్లు బోధన్ టౌన్ సీఐ వెంకటరమణ తెలిపారు. ఈ వ్యక్తికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్ప శాయి రెండు రోజులపాటు జైలుశిక్ష విధించారని సీఐ పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన కేసులో ఇద్దరికి ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గంగాధర్ రెండు రోజుల జైలు శిక్ష విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్మూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ టెస్టులో మద్యం తాగి వాహనాలు నడిపిన మాసం మహేశ్, మరాఠ నగేశ్, బాలాజీ పట్టుబడ్డారు. వీరిని సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా ముగ్గురికీ రెండు రోజులపాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

నవీపేట, జనవరి 24: మండలంలోని జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ సీనియర్ పాఠశాల టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం శుక్రవారం నిర్వహించారు. పాఠశాల సీఈవో హరితగౌడ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్ఎస్ఆర్ సంస్థల చైర్మన్ డాక్టర్ మారయ్యగౌడ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు క్రమ శిక్షణతో చదువుతూ ఉన్నత శిఖరాలకు ఎదిగి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల నృత్యాలు అలరించాయి.

'హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

ఆర్మూర్‌టౌన్, జనవరి24: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ మహిళ రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి అన్నారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల్లో మహిళలకు ఉచిత బస్సు తప్ప ఏమీ అమలు చేయలేదన్నారు. హామీలన్నీ అమలు చేయని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామ